డెవిన్.. ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ప్రపంచంలోనే ఏఐ ఆధారిత తొలి టెకీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): సాంకేతిక రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన ఆవిష్కరణలకు కృత్రిమ మేధ (ఏఐ) శ్రీకారం చుడుతున్నది. న్యూస్ రీడర్‌గా మారి వార్తలు చదవడం, పాఠశాల విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు.. ఇప్పుడు ఏకంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అవతార మెత్తి ప్రోగ్రామ్స్‌ను రాసే స్థాయికి చేరుకొన్నది. అమెరికాకు చెందిన స్టార్టప్ కంపెనీ 'కాగ్నిషన్' ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను రూపొందించింది. 'డెవిన్'గా నామకరణం చేసిన ఈ ఏఐ టెకీ ప్రపంచంలోనే మొట్టమొదటిది కావడం విశేషం.

ఏ పనులు చేస్తుంది?	కచ్చితత్వం ఎలా?
ఒక కమాండ్ లేదా ప్రాంప్ట్ ఇస్తే చాలు అలవోకగా ప్రోగ్రామ్ కోడ్ మొత్తాన్ని రాసేస్తుంది. చిటికెలో వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుంది. ఇచ్చిన ఇన్‌పుట్స్‌కు అనుగుణంగా నచ్చిన వీడియోలను క్రియేట్ చేస్తుంది. ప్రోగ్రామ్స్‌లో బగ్స్ గుర్తించడంతో పాటు వాటికి పరిష్కారాలను సూచిస్తుంది.	మనం అడిగే ప్రశ్నలకు ఏఐ చాట్‌జీపీటీ దాదాపుగా కచ్చితత్వంతో సమాధానాలను ఇస్తుందని భావిస్తున్నాం. అయితే, ఏఐ యూనివర్సల్ గ్రాఫ్‌లో చాట్‌జీపీటీ కచ్చితత్వాన్ని 0.52 శాతంగా లెక్కిస్తే, డెవిన్ కచ్చితత్వం 13.86 శాతంగా నమోదైంది. దీన్ని బట్టి ఈ టెకీ ఎంత కచ్చితత్వంతో ప్రోగ్రామ్స్‌ను డిజైన్ చేస్తుందో అర్థంచేసుకోవచ్చు.

టెకీల ఉద్యోగాల మాటేమిటి?

ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను తీసుకొస్తే, తమ ఉద్యోగాల మాటేమిటి? అన్న అనుమానాలు వ్యక్తం చేసేవారికి కాగ్నిషన్ కంపెనీ వివరణ కూడా ఇచ్చింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను ఏఐ ఇంజినీర్లతో భర్తీ చేయాలనే ఉద్దేశం తమకు లేదని.. కేవలం వారి పనుల్ని సులభతరం చేయడంలో భాగంగా మాత్రమే డెవిన్‌ను రూపొందించామని తెలిపింది.

2029నాటికి మానవ మేధస్సును మించనున్న ఏఐ

న్యూయార్క్, మార్చి 13: ఇప్పటికే సంచలనాలు సృష్టిస్తూ ఉద్యోగాలకు పెను ముప్పుగా మారిన కృత్రిమ మేధ రానున్న రోజుల్లో మరింత పదునెక్కుతుందట. 2029 నాటికి మానవ మేధస్సును ఏఐ మించిపోనుందని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అంచనా వేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో రే కర్జ్‌వీల్ అనే ప్రఖ్యాత ఫ్యూచరిస్ట్ కూడా ఇదే అంచనా వేశారు. మానవుల మేధస్సును ఏఐ దాటాలంటే ఇంకో వందేండ్లు పదుతుందని కొందరు ఊహిస్తున్నారని, కానీ, ఇందుకు ఎక్కువ సమయం పట్టబోదని, మరో ఐదేండ్లలో ఇది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. కాగా, 1999లో కర్జ్‌వీల్.. భవిష్యత్తులో ఏఐ ప్రభావం పెరిగిపోతుందని అంచనా వేయగా ఇప్పుడు అది నిజమయ్యింది.

ఐదేండ్లలో 22,217 బాండ్లు

ఎన్‌క్యాష్ చేసుకొన్న ఎన్నికల బాండ్లు 22,030

పీఎం రిలీఫ్ ఫండ్‌కు 187 బాండ్ల డబ్బులు

సుప్రీంకోర్టులో ఎస్బీఐ చైర్మన్ అఫిడవిట్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాజకీయ పార్టీలకు నిధులు అందజేసేందుకు ఉద్దేశించిన ఎన్నికల బాండ్ల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. సర్వోన్నత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం ఈ డాటాను కేంద్ర ఎన్నికల సంఘానికి(ఈసీ) నిర్దిష్ట గడువులోగా అందజేసినట్టు ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ మేరకు ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా న్యాయ స్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు.

ఎస్బీఐ అఫిడవిట్‌లోని ప్రధానాంశాలు

- ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ ఫిబ్రవరి 15 మధ్య 22,217 బాండ్లను దాతలు కొనుగోలు చేశారు.
- ఇందులో 22,030 బాండ్లను పలు రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసుకుని నిధులు తీసుకొన్నాయి.
- కొనుగోలు చేసిన 15 రోజుల గడువులోగా మిగతా 187 బాండ్లను ఏ పార్టీ ఎన్‌క్యాష్ చేసుకోలేదు. దీంతో గెజిట్ నోటిఫికేషన్-20 (తేదీ. జనవరి 2, 2018) నిబంధనల ప్రకారం.. వాటిని రిడీమ్ చేసి దాని ద్వారా వచ్చిన డబ్బును పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్‌లో జమ చేశాం.
- ఐదేండ్లలో ఎన్ని బాండ్లు జారీ చేశాం? ఎవరు? ఎన్ని కొనుగోలు చేశారు? ఎప్పుడు కొనుగోలు చేశారు? ఏయే రాజకీయ పార్టీలు ఈ బాండ్లను స్వీకరించాయి? ఎప్పుడు స్వీకరించాయి? ఎప్పుడు ఎన్‌క్యాష్ చేసుకొన్నాయి? తదితర వివరాలను అన్నింటినీ మార్చి 12న నిర్దిష్ట గడువులోగా ఈసీకి అందజేశాం.

ఏ పార్టీకి ఎన్ని వచ్చాయో తేలేది అప్పుడే..

ఎన్నికల బాండ్ల వివరాలను ఈసీకి ఇచ్చినట్టు ఎస్బీఐ బుధవారం అఫిడవిట్‌ను సుప్రీంకోర్టుకు సమర్పించినప్పటికీ.. ఏ పార్టీకి ఎన్ని నిధులు దక్కాయన్నదానిపై స్పష్టతను ఇవ్వలేదు. అయితే, ఈసీకి ఇచ్చిన డాటాలో ఆ వివరాలను పొందుపరిచినట్టు కోర్టుకు తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం.. ఈ నెల 15 సాయంత్రం 5 గంటల్లోగా ఈసీ ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపరచాల్సి ఉన్నది. అంటే శుక్రవారం సాయంత్రంలోగా ఏ పార్టీకి ఎన్ని నిధులు వచ్చాయి? ఎవరెవరు ఇచ్చారనే విషయాలు తెలియబోతున్నాయి. 2018 మార్చి నుంచి ఇప్పటివరకు 30 విడుతల్లో ఎస్బీఐ రూ.16,518 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను విక్రయించింది. అత్యధిక విరాళాలు బీజేపీకే దక్కినట్టు నివేదికల సారాంశం.

గడువులోగా వెల్లడిస్తాం: ఈసీ

సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను ఎస్బీఐ నిర్దిష్ట సమయానికే అందజేసినట్టు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ బుధవారం తెలిపారు. బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను కోర్టు ఇచ్చిన గడువులోగా బహిర్గతం చేస్తామని పేర్కొన్నారు. 'బాండ్ల డాటాను ఎస్బీఐ నిర్దిష్ట సమయంలోనే (మార్చి 12న) ఈసీకి ఇచ్చింది. కోర్టు ఇచ్చిన గడువు తేదీని చూసి.. ఆలోపే బాండ్ల వివరాలను వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధంగా ఉన్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు.

అమెరికాలో తెలంగాణ విద్యార్థి మృతి

హైదరాబాద్, మార్చి 13: అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన జెట్ స్కీ ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి మృతి చెందాడు. కాజీపేటకు చెందిన 27 ఏండ్ల వెంకటరమణ పిట్టల హెల్త్ ఇన్ఫర్మేటిక్స్‌లో ఇండియానా యూనివర్సిటీలో మాస్టర్స్ చేస్తున్నాడు. ఈ నెల 9న స్నేహితులతో కలిసి ఫ్లోరిడాలోని విస్టీరియా ఐలాండ్‌కు వెళ్లాడు. అక్కడ నీటిలో జెట్ స్కీ (బైక్‌లా ఉండే బోట్)పై వెళ్తుండగా, మరో జెట్ స్కీ ఢీకొనడంతో వెంకటరమణ మృతి చెందాడు. 14 ఏండ్ల బాలుడు సురక్షితంగా బయటపడ్డాడు. కాగా, వెంకట రమణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు అతని స్నేహితులు 'గో ఫండ్ మీ' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు.

23 జాతుల కుక్కలపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: పెంపుడు కుక్కల దాడుల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పిట్‌బుల్ టెర్రియర్, అమెరికన్ బుల్‌డాగ్, రాట్‌వీలర్, మస్టిఫ్స్ వంటి 23 జాతుల కుక్కల సంతానోత్పత్తి, అమ్మకాలను నిషేధించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది. వీటిని ప్రజలు పెంచుకోవడాన్ని కూడా నిషేధించింది. ఇప్పటికే ప్రజల వద్ద ఉన్న ఈ పెంపుడు కుక్కలకు సంతానోత్పత్తి జరగకుండా స్టెరిలైజ్ చేయాలని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ ఈ నెల 12న లేఖలు రాసింది.

సీబీఎస్ఈ నూతన చీఫ్‌గా రాహుల్ సింగ్

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) చైర్‌పర్సన్‌గా రాహుల్ సింగ్‌ను కేంద్రం నియమించింది. ఆయన 1996 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుత సీబీఎస్ఈ చీఫ్ నిధి చిబ్బెర్ నీతి ఆయోగ్ సలహాదారుగా నియమితులయ్యారు. రాహుల్ ప్రస్తుతం డీఓపీటీ అదనపు కార్యదర్శిగా పని చేస్తున్నారు. రాహుల్ స్థానంలో ఏపీ దాస్ జోషీని డీఓపీటీ అదనపు కార్యదర్శిగా కేంద్రం నియమించింది.

ఉత్తరాఖండ్ యూసీసీకి రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ శాసనసభ ఫిబ్రవరి 7న ఆమోదించిన ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 11న ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీంతో స్వాతంత్ర్యానంతరం ఈ చట్టాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ గుర్తింపు పొందింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ చట్టం అమల్లోకి రావడం వల్ల ప్రజలందరికీ సమాన హక్కులు లభిస్తాయని, మహిళల అణచివేతకు తెర పడుతుందని చెప్పారు. సామాజిక సమానత్వం ప్రాముఖ్యతను రుజువు చేస్తూ, సామరస్యాన్ని ప్రోత్సహించడంలో ఈ చట్టం ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు.

జమిలిపై నేడు కోవింద్ కమిటీ నివేదిక!

రాజ్యాంగంలోని ఐదు అధికరణల సవరణకు సిఫార్సు?



న్యూఢిల్లీ, మార్చి 13: దేశంలో ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ, మున్సిపాల్టీ, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ గురువారం నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికల నిర్వహణ మనదేశంలో ఎంతవరకు సాధ్యం, ఇతర అంశాలపై వివిధ వర్గాల నుంచి సమాచారం, అభిప్రాయాలు సేకరించిన కోవింద్ కమిటీ గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కలిసి నివేదిక సమర్పిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. జమిలి ఎన్నికలకు రాజ్యాంగంలోని ఆఖరి ఐదు అధికరణలను సవరించాలని కమిటీ సూచించినట్టు తెలిసింది. అంతేకాకుండా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు ఒకే ఓటరు లిస్టు ఉంచే విషయంపై కూడా కమిటీ దృష్టి సారించింది. ఇప్పటికే దేశంలోని పలు అధికార, విపక్ష పార్టీల నుంచి, లా కమిషన్, ఇతర ముఖ్య సంస్థల నుంచి ఈ కమిటీ అభిప్రాయాలను సేకరించింది.

నేడు ఢిల్లీలో రైతుల మహాపంచాయత్

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం రూపకల్పన సహా పలు డిమాండ్ల సాధనలో మోదీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ అణచివేత విధానాలను అవలంబిస్తున్నదని రైతు సంఘాలు ఆరోపించాయి. రైతుల సమస్యల సాధనకు ఈ నెల 14న రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే మహాపంచాయత్‌కు పెద్దయెత్తున తరలి రావాలని అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ దవాలే పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక విధానాలపై అన్నదాతలు గత నెల రోజులకు పైగా చేపట్టిన ఉద్యమ తీవ్రతను ప్రభుత్వం చవిచూసిందని అన్నారు. టియర్ గ్యాస్ షెల్స్, లాఠీచార్జిలతో తమ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించినా రైతులు ఎంతమాత్రం వెరవలేదని పేర్కొన్నారు.

భర్తకు విడాకులివ్వకుండా వేరొకరితో సహజీవనం చెల్లదు

అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్: భర్తకు విడాకులివ్వకుండా, వేరొకరితో సహజీవనం చేసే వారికి మద్దతుగా ఆదేశాలు జారీ చేయలేమని అలహాబాద్ హైకోర్టు ఇటీవల తెలిపింది. చట్టవిరుద్ధ బాంధవ్యాలకు రక్షణ కల్పిస్తే, సమాజంలో అరాచకం ప్రబలుతుందని చెప్పింది. సహజీవనం చేస్తున్న జంట రక్షణ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ జంటలో మహిళకు 13 ఏళ్ల వయసులో ఓ వ్యక్తితో వివాహం జరిగింది. ఆయనకు విడాకులివ్వకుండానే వేరొకరితో ఆమె సహజీవనం చేస్తున్నది. తమకు రక్షణ కల్పించాలని వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. ధర్మాసనం స్పందిస్తూ, మహిళకు మెజారిటీ వయసు వచ్చిన తర్వాత అయినా తన భర్త నుంచి విడాకులు మంజూరు చేయాలని లేదా తమ వివాహాన్ని రద్దు చేయాలని కోర్టును కోరలేదని గుర్తు చేసింది. వీరిద్దరికీ రక్షణ కల్పిస్తూ ఆదేశాలిస్తే, వీరి చట్ట వ్యతిరేక సంబంధాన్ని కోర్టు చట్టబద్ధం చేసినట్లవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రయోగించిన క్షణాల్లోనే పేలిపోయిన జపాన్ తొలి ప్రైవేట్ రాకెట్

టోక్యో : జపాన్‌లో తొలిసారిగా ఒక ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. ప్రయోగించిన కొద్ది క్షణాల్లోనే గాలిలో పేలిపోయింది. పెద్దయెత్తున నిప్పులు వెదజల్లుతూ శకలాలు చెల్లా చెదురుగా పడ్డాయి. సెంట్రల్ జపాన్ వయకమ ప్రిఫికచర్‌లోని లాంచ్‌ప్యాడ్ నుంచి బుధవారం ప్రయోగించిన కైరోస్ రాకెట్ కొద్ది సెకండ్లలోనే పేలిపోవడంతో మండుతున్న శకలాలు చుట్టూ ఉన్న కొండలపై పడగా, వాటిని ఆర్పడానికి వాటర్ స్ప్రింక్లర్‌లను ఉపయోగించారు. రాకెట్ లాంచింగ్ సెంటర్‌లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, మంటలను అదుపులోకి తెచ్చామని కుషిమోటో నగర అధికారులు తెలిపారు.

72 మందితో బీజేపీ రెండో జాబితా

గడ్కరీ, గోయల్, ఖట్టర్‌లకు చోటు
తెలంగాణలో 6 స్థానాలకు అభ్యర్థులు

న్యూఢిల్లీ/ హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికార బీజేపీ 72 మంది సభ్యుల పేర్లతో రెండో జాబితాను బుధవారం విడుదల చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అనురాగ్ ఠాకూర్, మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, మనోహర్ లాల్ ఖట్టర్, త్రివేంద్ర సింగ్ రావత్.. తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఇప్పటివరకు మొత్తం 265 లోక్‌సభ స్థానాలకు బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలో 6 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్ నేతగాని, మెదక్ నుంచి రఘునందన్‌రావు, నల్లగొండ లోక్‌సభకు మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఆదిలాబాద్ గోడెం నగేష్, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్ పేర్లను పార్టీ ప్రకటించింది. ఆరుగురు కూడా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే కావడం గమనార్హం.

సీఏఏ.. ఎన్నికల జిమ్మిక్కు

- లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ యత్నం
- ప్రజల్లో విభజనకే సీఏఏ : మమత
- 1947 కంటే ఎక్కువ వలసలు: కేజ్రీ

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుకు వ్యతిరేకంగా బుధవారం కూడా నిరసనలు కొనసాగాయి. ఈశాన్య రాష్ట్రాలతో పాటు కేరళలో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. జాతీయ పౌర పట్టిక(ఎన్ఆర్సీ)తో సీఏఏకు సంబంధం ఉందని, అందుకే సీఏఏను వ్యతిరేకిస్తున్నట్టు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పారు. జల్‌పాయిగురిలో ఆమె మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ముందు సీఏఏను అమలు చేయడం జిమ్మిక్ అని ఆరోపించారు. బెంగాల్‌లో నిర్బంధ క్యాంపులను ఏర్పాటు చేయబోమని ఆమె ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ముందు సీఏఏను అమలు చేయడాన్ని బీజేపీ చేస్తున్న మురికి ఓటు బ్యాంకు రాజకీయాలుగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ విమర్శించారు. శరణార్థులను ఓటుబ్యాంకుగా మలుచుకోవాలని బీజేపీ భావిస్తున్నదని ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి పేద మైనారిటీలు మన దేశంలోకి ప్రవాహంలా వచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం గేట్లు తెరిచిందని ఆయన పేర్కొన్నారు. 1947 కంటే ఎక్కువ వలసలు కొనసాగుతాయని, మన దేశంలో శాంతిభద్రతల సమస్య వస్తుందని తెలిపారు. సీఏఏ అమలుకు వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీఏఏను అమలు చేయబోమని గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని బుధవారం కేరళ మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే సీఏఏను సవాల్ చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున తదుపరి తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలను పరిశీలించాలని అడ్వకేట్ జనరల్‌ను ఆదేశించింది.

సీఏఏ వివక్షాపూరితం: ఐక్యరాజ్యసమితి

సీఏఏ అమలుపై ఐక్యరాజ్యసమితి, అమెరికా స్పందించాయి. 2019లో తాము చెప్పినట్టుగానే సీఏఏ ప్రాథమికంగా వివక్షతో కూడుకున్నదని, దీని పట్ల ఆందోళన చెందుతున్నట్టు ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయ అధికార ప్రతినిధి రాయిటర్స్ వార్తాసంస్థకు వెల్లడించారు. అంతర్జాతీయ మానవ హక్కులను సీఏఏ అమలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయా అనేది తమ కార్యాలయం పరిశీలిస్తున్నదని తెలిపారు. అమెరికా కూడా ఇదే రకంగా స్పందించింది. సీఏఏ అమలు నిబంధనలను పరిశీలిస్తున్నామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. మతస్వేచ్ఛను గౌరవించడం, అన్ని వర్గాల వారిని సమానంగా చూడటం ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రమని అభిప్రాయపడ్డారు.

15లోగా వేరే బ్యాంకు ఫాస్టాగ్ తీసుకోండి

పేటీఎం ఫాస్టాగ్ యూజర్లకు ఎన్‌హెచ్ఏఐ సూచన

న్యూఢిల్లీ: పేటీఎం ఫాస్టాగ్ వాడుతున్న వాహనదారులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) బుధవారం కీలక సూచన చేసింది. టోల్‌గేట్‌ల వద్ద పెనాల్టీలు, డబుల్ చార్జీలు పడకుండా ఉండేందుకు గానూ మార్చి 15లోగా వేరే బ్యాంకు నుంచి ఫాస్టాగ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ విధించిన ఆంక్షల నేపథ్యంలో మార్చి 15 తర్వాత పేటీఎం ఫాస్టాగ్‌కు రీఛార్జ్, టాప్‌అప్ చేసుకోవడం కుదరదు.

అహల్యా నగర్‌గా అహ్మద్‌నగర్

ముంబై, మార్చి 13 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ పేరు మారింది. ఇక నుంచి ఆ నగరాన్ని పుణ్యశ్లోక్ అహల్యాదేవి నగర్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పాటు పుణె జిల్లాలోని వెల్హే తాలూకా పేరును రాజ్‌గఢ్‌గా మార్చారు. అలాగే బ్రిటిష్ కాలంలో పెట్టిన ఎనిమిది రైల్వే స్టేషన్లకు పేర్లను మార్చడానికి క్యాబినెట్ ఆమోదించింది.

- వంట మనిషి కుమార్తెకు సీజేఐ సన్మానం

సుప్రీంకోర్టులో వంట మనిషిగా పనిచేస్తున్న అజయ్ కుమార్ కుమార్తె ప్రజ్ఞ అమెరికాలోని కాలిఫోర్నియా, మిషిగన్ యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్‌తో మాస్టర్స్ చేయడానికి ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం జడ్జి లాంజ్‌లో ప్రజ్ఞను సన్మానిస్తున్న సీజేఐ, ఇతర జడ్జీలు

వయసు నిర్ధారణకు స్కూల్ సర్టిఫికెట్లే కీలకం

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ : వయసు నిర్ధారణకు పాఠశాల ఇచ్చే సర్టిఫికెట్‌కే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్కూల్ సర్టిఫికెట్, మున్సిపాలిటీ, స్థానిక సంస్థలు ఇచ్చే జనన ధ్రువీకరణ పత్రం లేకపోతేనే చివరిగా వైద్యులు ఆసిఫికేషన్ పరీక్ష ద్వారా నిర్ధారించే వయసును ప్రామాణికంగా తీసుకోవాలని పేర్కొన్నది. వినోద్ కటారా అనే వ్యక్తి 40 ఏండ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో దోషిగా తేలి యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. 2016 ఆగస్టులో అలహాబాద్ హైకోర్టు.. ఈ కేసు విచారణ జరుగుతున్నప్పుడు హత్య చేసిన నాటికి ముద్దాయి మైనర్ అయి ఉండొచ్చని అనుమానించి వయసును నిర్ధారించాలని జువెనైల్ జస్టిస్ బోర్డును ఆదేశించింది. ఆసిఫికేషన్ పరీక్ష చేసిన మెడికల్ బోర్డు ముద్దాయికి 56 ఏండ్లు ఉంటాయని నిర్ధారించింది. దీని ప్రకారం హత్య జరిగిన సమయానికి తన వయసు 15 ఏండ్లే ఉంటాయని, మైనర్‌గా పరిగణించి శిక్ష తగ్గించాలని అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆగ్రా అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి విచారణ జరిపి.. హత్య చేసే నాటికి అతడు మేజర్ అని స్కూల్ రికార్డులను బట్టి తేల్చారు.

అణ్వాయుధ ప్రయోగానికి వెనుకాడం

మాస్కో: తమ రాజ్యాధికారం, సార్వభౌమత్వం, స్వాతంత్ర్యానికి ముప్పు వాటిల్లితే అణ్వాయుధాలు వాడేందుకు వెనుకాడబోమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. అణు వివాదాన్ని సృష్టించే చర్యలకు అమెరికా దూరంగా ఉంటుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న వేళ పశ్చిమ దేశాలకు పుతిన్ తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జోబైడెన్‌ను అనుభవజ్ఞుడైన రాజకీయవేత్తగా అభివర్ణించారు. ప్రపంచం అణుయుద్ధంవైపు వెళ్తుందని తాను అనుకోవడం లేదన్నారు.ఉక్రెయిన్‌తో చర్చలకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

సోదరుడితో బంధాలు తెంచుకున్నా

కోల్‌కతా, మార్చి 13: పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తన సొంత తమ్ముడు బాబున్ బెనర్జీకి షాక్ ఇచ్చారు. హౌరా లోక్‌సభ సీటును మళ్లీ ప్రసూన్ బెనర్జీకి కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాబున్‌తో బంధుత్వాన్ని తెంచుకున్నట్టు మమత తెలిపారు. బుధవారం ఆమె జల్పాయ్‌గురిలో విలేకర్లతో మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాపై అసహనం వ్యక్తం చేసిన బాబున్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రతి ఎన్నికలకు ముందు ఆయన ఏదో ఒక సమస్యను సృష్టిస్తుంటారని, అత్యాశపరులంటే తనకు ఇష్టం ఉండదని, కుటుంబ రాజకీయాలను విశ్వసించబోనని పేర్కొన్నారు.



మళ్లీ బైడెన్ X ట్రంప్

వాషింగ్టన్, మార్చి 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో మళ్లీ పాత ప్రత్యర్థులే తలపడనున్నారు. డెమొక్రటిక్ పార్టీ నుంచి ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ తరపున డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. జార్జియా, హవాయి, మిస్సిస్సిప్పి, వాషింగ్టన్‌లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థిత్వానికి అవసరమైన మద్దతును బైడెన్ కూడగట్టుకున్నారు. ఇక, ట్రంప్ కూడా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి కావాల్సిన ప్రతినిధుల మద్దతును ఇప్పటికే దక్కించుకున్నారు. దీంతో బైడెన్(81)ను ఆగస్టులో షికాగోలో జరగనున్న డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో అభ్యర్థిగా ప్రకటించడం లాంఛనమే. ఇక, రిపబ్లిక్ అభ్యర్థిగా జూలైలో ట్రంప్(77)ను అధికారికంగా ప్రకటించనున్నారు.

పోలియో పాల్ ఇక లేరు

న్యూయార్క్: ఆరేండ్ల వయసులోనే పోలియో బారిన పడి 72 ఏండ్లు ఒక ఇనుప యంత్రంలో జీవించిన పాల్ అలెగ్జాండర్(78) కన్నుమూశారు. అమెరికాలోని టెక్సాస్‌కు చ